## లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలియజేయ వలసిందిగా ఏసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
తెలుగు దినపత్రిక


## భారత ఆర్మీ చేతికి ఆత్మాహుతి డ్రోన్స్

న్యూఢిల్లీ:ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్స్ కీలకంగా మారాయి. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయికి డ్రోన్స్ చేరుకున్నాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమ్ములపొదిలోకి మరో కీలక అస్త్రం వచ్చి చేరింది. శత్రుమూకలకు వెన్నులో వణుకు పుట్టించే ఆత్మాహుతి డ్రోన్స్‌ను (కామెకాజీ డ్రోన్స్) గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ సంస్థ సైన్యానికి తాజాగా అప్పగించింది. వీటి కోసం రూ.10 కోట్లకు గతంలో ఆర్మీ ఒప్పందం కుదుర్చుకోగా తాజాగా వందల సంఖ్యలో ఈ డ్రోన్‌లను ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ డెలివరీ చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.గతేడాది డిసెంబర్‌లోనే ఈ ఒప్పందం కుదరగా అత్యవసర ప్రాతిపదికన నెలల వ్యవధిలోనే కంపెనీ ఈ డ్రోన్స్‌ను సరఫరా చేసింది. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే కఠిన వాతావరణంలో కూడా పనిచేసేలా ఈ డ్రోన్స్‌ను డిజైన్ చేశామని సంస్థ వెల్లడించింది. యుద్ధ స్థలంలోని పరిస్థితులను రియల్‌టైమ్‌లో తెలుసుకునేందుకు ఉద్దేశించిన ఫస్ట్ పర్సన్ వ్యూ డ్రోన్స్ తయారీకి కూడా ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ పేరుగాంచింది.


నల్లగొండ సంపుటి:16 సంచిక:82 ఎడిటర్: సయ్యద్ పాష 08-04-2026 బుధవారము పేజీలు :8 వెల:1/-


# మోదీ, విజయన్ ల మధ్య ఒప్పందం ఉంది



తిరువనంతపురం: కేరళం సీఎం పినరయి విజయన్ తన 120 నెలల పాలనలో పూర్తిగా విఫలమయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేరళంలో సరైన అవకాశాలు లేక యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కేరళంలో వృద్ధులు, చిన్నపిల్లలే ఎక్కువగా కనిపిస్తున్నారని తెలిపారు. విద్యావంతులు నైపుణ్యం కలిగిన యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్న ఆయన వాళ్లు తిరిగొచ్చి ఉపాధి పొందేలా చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మాదిరి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం లాంటివి కేరళంలో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి వివరించారు.తెలంగాణలో ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చని పినరయి విజయన్ సహా ఎల్ డీఎఫ్ నేతలకు స్పష్టం చేశారు. ఎన్నికలు కేరళం, తెలంగాణ మధ్య కాదన్న రేవంత్ యూడీఎఫ్, ఎల్ డీఎఫ్ మధ్య జరుగుతున్నాయని తెలిపారు. పినరయి విజయన్ పని అయిపోయిందన్న రేవంత్‌రెడ్డి, మూడింట రెండొంతుల మెజార్టీతో యూడీఎఫ్ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల తనపై పినరయి చేసిన విమర్శలను రేవంత్‌రెడ్డి తోసిపుచ్చారు.మోదీ, విజయన్ ల మధ్య ఒప్పందం ఉంది : తెలంగాణలో కేసీఆర్ ను ఎలా మార్చారో కేరళంలో విజయన్ ను కూడా అలా మారుస్తారని రేవంత్ రెడ్డి అన్నారు. విజయన్ గాడ్ ఫాదర్ మోదీ దిల్లీలో ఉన్నారన్నారు. ఆయనే విజయన్ ను కేసుల నుంచి రక్షిస్తున్నారని రేవంత్ వివరించారు. మోదీ, విజయన్ మధ్య ఒప్పందం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. కేరళంలో సక్సెస్ స్టోరీ విజయన్ పాలనలో వచ్చింది కాదని ఉమెన్‌చాందీ, కరుణాకరన్ కేరళం అభివృద్ధి కోసం బాటలు వేశారన్నారు. పినరయి విజయన్‌కు కాలం అయిపోందని అన్నారు. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చున్నారు. ఈ విషయంలో తాను విజయన్‌కు సవాల్ విసురుతున్నానన్నారు.చర్చకు సిద్ధం : పినరయి విజయన్ కేరళం ప్రజలను మోసం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇందుకు సంబంధించి తాను చాలా ఆధారాలు ఇచ్చానన్నారు. వారు తెలంగాణపై(పినరయి విజయన్) తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. దీనిపై పినరయి విజయన్ తో చర్చకు తాను సిద్ధమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయనకు ఆదర్శవంతమైన నేతలు మోదీ, అమిత్ షానా లేక జ్యోతిబసు, సోమనాథ్ చటర్జీనా అని ప్రశ్నించారు. విజయన్ ప్రధాని మోదీ సూచనలు తీసుకుంటున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక మోదీ దిల్లీ నుంచి పాలిస్తే మరో మోదీ తిరువనంతపురం నుంచి పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేరళంలో విజయన్ మోదీలా పాలిస్తున్నారన్నారు. ఓట్ల కోసం మోదీలానే విజయన్ తన పేరుతో ప్రచారం చేస్తున్నారన్నారు.

# సైనికుల్లా పని చేయాలి: టీపీసీసీ చీఫ్




నాగర్ కర్నూల్, : తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లగొండ మెడికల్ కాలేజీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నల్లగొండ : ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ సూచన మేరకు మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగ నేతృత్వంలో ప్రపంచ అరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ఆరోగ్య శిక్షణ కేంద్రంలో పోషకాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన టుగెదర్ ఫర్ హెల్త్-స్టాండ్ విత్ సైన్స్ అనే పిలుపు మేరకు లైన్వాడ హెల్త్ సెంటర్ దగ్గర మెడికల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం మెడికల్ కాలేజీలో పోస్టర్ ఆవిష్కరణ, ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులతో కలిసి వెన్ సైన్స్ స్పీక్స్- షుడ్ వి లిసన్ ఆర్ కోషన్ అనే అంశంపైన డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, డాక్టర్ స్వరూప, డాక్టర్ భద్రినారాయణ, డాక్టర్ అనుపమ, కమ్యూనిటీ మెడిసిన్ ఫాకల్టీ, ఇతర వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిక్కెట్ల ఛార్జీలు పెంచనున్న ఎయిరిండియా..




న్యూఢిల్లీ:చమురు సంక్షోభం ప్రభావం దేశీయ విమానయాన సంస్థలపై పడుతోంది. అంతర్జాతీయంగా విమాన ఇంధన ధరలు పెరుగుతుండటంతో టిక్కెట్ల ఛార్జీలు పెంచాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. ఏప్రిల్ 8, బుధవారం నుంచే టిక్కెట్ల ఛార్జీల పెంపు నిర్ణయం అమలులోకి రానుంది. డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్‌తోపాటు, ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ టిక్కెట్ల ఛార్జీలు కూడా పెరుగుతాయి. ప్రస్తుతానికి కొన్ని ఇంటర్నేషనల్ రూట్లలో మాత్రం ఛార్జీల పెంపు ఉండబోతుంది.ఇరాన్ యుద్ధం కారణంగా చమురు సంక్షోభం తలెత్తిన సంగతి తెలిసిందే. హార్ముజ్ జలసంధి మూసివేయడం, ఇరాన్ సహా గల్ఫ్ దేశాల్లో చమురు కేంద్రాలపై దాడులు జరగడం కారణంగా చమురు లభ్యత తగ్గి, ధరలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విమాన టిక్కెట్లపై విధించే ఫ్యూయల్ ఛార్జీలు కనిష్టంగా రూ.299 నుంచి గరిష్టంగా రూ.899కి పెంచాలని ఎయిర్ ఇండియా నిర్ణయించింది. ప్రస్తుతం యుద్ధం కారణంగా ముడి చమురు ధర భారీగా పెరిగింది. విమాన ఇంధన ధరలు కూడా రెట్టింపయ్యాయి. బ్యారెల్ విమాన ఇంధన ధర ఫిబ్రవరిలో 99.40 డాలర్లు ఉండగా, గతవారం 195.19 డాలర్లు ఉంది. ఎయిర్ ఇండియా తాజా నిర్ణయం ప్రకారం నేరుగా టిక్కెట్ల ధరలు కాకుండా ఇంధన సర్‌ఛార్జీలు మాత్రమే పెరుగుతాయి. గతంలో ఈ విషయంలో ఫ్లాట్ ఛార్జీలు విధించేవారు. ఇప్పుడు దూరాన్ని బట్టి ఛార్జ్ చేస్తున్నారు. 500 కిలోమీటర్లలోపు దూరానికి అదనంగా రూ.299, 501-1000 కిలోమీటర్లలోపు దూరానికి రూ.399, 1,001-1,500 కిలోమీటర్లలోపు దూరానికి రూ.549, 1,501-2,000 కిలోమీటర్లలోపు దూరానికి రూ.749, 2,000 కిలోమీటర్లకు మించిన దూరానికి రూ.899 అదనంగా చెల్లించాలి. ఏప్రిల్ 8, ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ ఛార్జీలు అమలవుతాయి. ఇందులో పర్ సెక్టార్, పర్ ప్యాసింజర్ అనే రెండు విభాగాలుంటాయి. అంటే ఒక చోటు నుంచి మరో చోటుకు నేరుగా వెళ్తే ఒక సెక్టార్ కింద పరిగణిస్తారు. అదే ఒక ప్రయాణికుడు కనెక్ట్ ఫ్లైట్ ద్వారా రెండు వేర్వేరు విమానాల్లో వెళ్తే రెండు సెక్టార్ల కింద దానికి రెండు ఫ్యూయల్ ఛార్జీలు అమలవుతాయి. దీని ద్వారా డైరెక్ట్ ఫ్లైట్ బుక్ చేసుకుంటే తక్కువ ఛార్జీ పడుతుంది. అదే కనెక్టింగ్ ఫ్లైట్ బుక్ చేసుకుంటే, అదనంగా మరికొంత చెల్లించాల్సి ఉంటుంది.

## ఫేక్ ప్రిడిక్షన్‌లను నమ్మొద్దు..



హైదరాబాద్, ఏప్రిల్ 7: ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగిపోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు.ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు.ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొఫైళ్లను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా షఎఎవతీషతీఱఎవ.ప్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

### బెంగాల్‌పై కన్నేస్తే పాక్ ఎన్ని ముక్కలవుతోందో

# దేవుడికే తెలియాలి



న్యూఢిల్లీ:కోల్‌కతాపై దాడి చేస్తామంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పాకిస్థాన్ రెండు భాగాలుగా విడిపోయినప్పుడు వారు పర్యవసానాలను అనుభవించారని ఎద్దేవా చేశారు. కాబట్టి ఆయన అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేయకూడదని సూచించారు. వారు బంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని భాగాలుగా విడిపోతుందో ఆ దేవుడికే తెలుసని వ్యాఖ్యానించారు.ఈ క్రమంలోనే 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండుగా విడిపోయిన విషయాన్ని రాజ్ నాథ్ ప్రస్తావించారు. 1971లో జరిగిన యుద్ధంలో తూర్పు పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. ఆ సమయంలో బంగ్లాదేశ్‌కు భారత సైన్యం అండగా నిలిచింది. అప్పట్లో పాక్ ఎన్నో పర్యవసానాలు ఎదుర్కొందని రాజ్‌నాథ్ గుర్తుచేశారు. ఈ సందర్భంగా రెండు పొరుగుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌కు వార్నింగ్ ఇచ్చారు.మరోవైపు ఈ ఘటనపై టీఎంసీ కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసింది. కోల్‌కతాపై దాడి చేస్తామని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ బహిరంగంగా బెదిరించడాన్ని ఖండించే ధైర్యం లేదని ఆరోపించింది. ఎన్నికల సభలో మాట్లాడిన ఎంపీ అభిషేక్ బెనర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "56 అంగుళాల ఛాతీ గల ప్రధానమంత్రి, ఆయన హోం మంత్రి ఓట్ల ప్రచారంలో ఎంతగా మునిగిపోయారంటే బంగాల్‌పై జరుగుతున్న ప్రత్యక్ష దురాక్రమణ బెదిరింపులకు స్పందించడానికి వారికి సమయం లేదు. పాకిస్థాన్ రక్షణ మంత్రి కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించారు. అయినా భారత యూనియన్‌లోని ఒక రాష్ట్రంపై, సార్వభౌమాధికారంపై జరిగిన ఈ ఘోరమైన దాడిని ఖండించే ధైర్యాన్ని నరేంద్ర మోదీకీ, అమిత్ షా గానీ లేదు. వారికి బంగాల్ ప్రజల ప్రాణాలు ఏమాత్రం లెక్కలేనట్టుగా ఉన్నాయి. వీరిద్దరు చాలా పిరికివాళ్లు. వారికి కనీసం కొద్దిపాటి ధైర్యం ఉన్నా, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి కేంద్ర బలగాలకు, బీఎస్‌ఎఫ్‌కు, భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛనివ్వాలి. నరేంద్ర మోదీకి ఆ ధైర్యం ఉందా అమిత్ షాకు ఆ ధైర్యం ఉందా రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ ధైర్యం ఉందా " అని ఆయన ప్రశ్నించారు.కాగా కొద్ది రోజుల క్రితం భారత్‌పై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి నోరుపారేసుకున్నారు. భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పిచ్చి ప్రేలాపనలు చేశారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ వ్యాఖ్యానించారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను వదేసి వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ అక్కసు వెళ్లగక్కారు. అయితే, తన వాదనలకు బలం చేకూర్చేలా ఖవాజా, ఎటువంటి ఆధారాలూ ఇవ్వకపోవడం గమనార్హం.ఇదిలా ఉండగా ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈ హెచ్చరికలపై ఖవాజా ఇప్పటికే తన అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం ఘటన జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. తమపై జరిగే దాడులను తిప్పికొడతామని ఖవాజా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.

### అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు

# తెచ్చుకోవద్దు: డీజీపీ శివధర్ రెడ్డి




ములుగు, : అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. ఈరోజు(మంగళవారం) వెంకటాపురం మండల కేంద్రంలో అరీవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పాముసూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం జరగాలని చెప్పుకొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. తీవ్రవాద ప్రాంతంలో ఇంత త్వరగా రోడ్లు వేయడం అభినందనీయమని అన్నారు. రోడ్లు వేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

## వేయిస్తంభాల ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి

వరంగల్: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సాధిస్తామని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వారు దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహించుకొని ఆలయ నాట్యమంటపంలో ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఆలయ సిబ్బంది స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం కేంద్ర టూరిజం పురావస్తుశాఖ విడుదల చేసిన రూ.14.14 కోట్లు ఏ పనులకు వినియోగిస్తారో కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి అజిత్‌ను అడిగి తెలుసుకున్నారు. కళ్యాణ మండపంలోని దక్షణ దిశలో ఉన్న 5 శాతం పనులు, నందీశ్వరునిపై మంటపం, ప్రదక్షణ పథం కింద 3 లేయర్లు, వెలికితీసి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సెంట్రల్ లైటింగ్, భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేందుకు గార్డెన్, కోనేరు పునరుద్దరణ, లైటింగ్, టాయిలెట్స్??, భక్తులు, పాదాచారులకు, ఫుట్‌వే, వసతులు ఏర్పాటు చేస్తామని కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ నుంచి లెటర్ ఇచ్చారన్నారు.2012లో ముందుభాగం అభివృద్ధికి రూ.30 కోట్లు కేటాయించగా అందులో రూ.10 కోట్లు పెట్టి సుందరీకరణ, గార్డెన్ ఏర్పాటు చేసినట్లు ఇంకా రూ.20 కోట్ల బడ్జెట్‌లో నిల్వ ఉన్నదని కుడా ఆధ్వర్యంలో గుడిచుట్టూ ఉన్న గృహయజమానులతో, కుడా అధికారులు చర్చలు జరుపుతున్నారని, గృహాలు కోల్పోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లింపులు చేసి తొలిగించడం వలన యునెస్కో గుర్తింపు వచ్చే అవకాశం ఉందని, ఆ ప్రక్రియ ప్రారంభమైందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గృహయజమానులు సహకరించాలని, ప్రభుత్వం ఇచ్చే నిధులతో వేరే ప్రాంతంలో గృహాలు నిర్మించుకోవడం ఉత్తమమని ఆయన అన్నారు. అర్చకులు గంగు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌శర్మ, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### ఆమ్ఆద్మీ పార్టీ యంపి రాఘవచద్దా ఇటీవల కాలంలో రాజ్యసభలో కార్పోరేట్ శక్తుల దోపిడీని కొత్తకోణంలో బయట పెట్టాడు...

ఆమ్ఆద్మీపార్టీ రాజ్యసభ ఉపనాయకుడు, యంగ్ డైనమిక్ లీడర్ రాఘవచద్దాను ఆఘమేఘాల మీద తొలగిస్తూ, ఆస్థానంలో పంజాబ్‌కు చెందిన మరో యంపి అశోక్ మిట్టల్‌ను నియమించారు. డిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. రాజ్యసభలో ఉప నాయకుడు ఎవరుండాలి అనేది ఆయన ఇష్టమే కావచ్చును. కానీ, ఆయన్ను తొలిగించిన సందర్భం, తొలిగిస్తూ రాఘవచద్దాకు రాజ్య సభలో మాట్లాడడానికి ప్రాదాన్యత ఇవ్వొద్దు అని రాసిన లేఖ! కేజ్రీవాల్‌ను ఇప్పటివరకు ఒక వ్యక్తిత్వం, అవినీతి వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అన్నా లేబుల్ తనకు తానే తుడిచి వేసుకున్నాడు. ఏకవ్యక్తి కేంద్రక రాజకీయ వ్యవస్థ ప్రతినిధి అని తనకు తాను నిరూపించుకున్నారు. రాఘవచద్దాను ఆయన సంధించేబాణాలు, లేవనెత్తే ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పలేక రాజ్యసభ నుండి సస్పెండ్ చేస్తే, దాన్ని బలపరుస్తూ తాను బిజెపికి అసలుసిసలైన ప్రత్యామ్నాయం అని చెప్పుకునే కేజ్రీవాల్ తీసుకున్న నిర్ణయం బిజెపిని బేషరతుగా బలపరిచే దిశగా ఉంది, తప్ప మరోరకంగా కనిపించదు. ఆమ్ఆద్మీ పార్టీ యంపి రాఘవచద్దా ఇటీవల కాలంలో రాజ్యసభలో కార్పోరేట్ శక్తుల దోపిడీని కొత్తకోణంలో బయట పెట్టాడు.ముఖ్యంగా వివిధ కంపెనీలు నెల రీఛార్జి పేరుతో 28రోజల కాలపరిమితి నే నెలగా పేర్కొన్నారని రాజ్యసభలో ఎండగట్టారు.వందల కోట్ల రూపాయల రీచార్జ్ కుంభకోణం బయట పెట్టడమే కాక,చట్టసభల ప్రజాప్రతినిధులు నెలకుకేవలం300 రూపాయల రీచార్జ్ నెలకు అపరిమిత వాడకంకుసరిపోతుండగావాళ్ళకు పది వేల రూపాయలు పోన్ చార్జీల క్రింద చెల్లించడం ఎందుకు?ఇది ప్రజల సొమ్ము దుర్వినియోగం కాదా? అని ప్రశ్నించారు.ఇట్లాంటి సంచలనాత్మక విషయాలను ఆయన రాజ్యసభలో ప్రస్తావించడం ద్వారా దేశంలోని యువతలో విపరీతమైన క్రేజ్ వచ్చింది.మద్యతరగతివర్గంతమకు ఓప్రాతినిద్యం లభించింది అనిసంబరపడ్డారు.దీనితో చిర్రెత్తు కొచ్చిన కేజ్రీవాల్ ఆయన్ను రాజ్యసభ ఉపనాయకుడుగా తొలగించడంతో పాటు,ఆయనకు ప్రాదాన్యత ఇవ్వొద్దు అని రాయడం రాజ్యసభ చరిత్రలోనే సంచలనం కలిగించింది.బావ ప్రకటనా స్వేచ్ఛను ఒక పార్లమెంటు సభ్యుడు కు నిరాకరిస్తూ లేక రాయడం అంటే రాజ్యాంగంలోని 19(1)ఏను నిరాకరించడం కేజ్రీవాల్ లాంటి వ్యక్తి రాజకీయ చరిష్మాకు మచ్చననే చెప్పవచ్చును? వాస్తవంగా రాఘవచద్దా లేవనెత్తిన అంశాలు ఆయనతోపాటు ఆమ్ఆద్మీపార్టీ కికూడాకీర్తిప్రతిష్ట తెచ్చిపెట్టింది.కానీ , కేజ్రీవాల్ చర్య దాన్ని తుడిచి పెట్టింది.రాజ్యసభ ద్వారా రాఘవ చద్దా దేశవ్యాప్తంగా అభిమానం నంపాదించుకోవడం ఇష్టంలేదా?తాను కోల్పోయిన స్థానాన్ని రాఘవ చద్దాపూరించుకుంటున్నాడనే అంతర్గత ద్వేషమా? లేదా ప్రత్యామ్నాయ నాయకత్వం స్థానం భర్తీ చేస్తాడనే భయమా?ఏదైనా కావచ్చును.మొత్తం మీద రాఘవ చద్దా ప్రాదాన్యత తగ్గించడంజరిగింది,రేపు ఆయనను పార్టీ నుండి గెంటి వేయడం కూడా జరుగవచ్చును?ఏదిఎలా ఉన్నా మరోసారి అరవింద్ కేజ్రీవాల్ తన లోపలి మనిషి ని బయట పెట్టుకొని, ప్రశ్నించే స్వభావాన్ని చంపి వేశాడని దేశ యువత భావిస్తుంది.ఇలా ప్రశ్నించే స్వభావాలు గొంతు నులపడం ఒక్క రాఘవచెద్దాతో మొదలు కాలేదు.డిల్లీ ఎన్నికల ముందు మరో రాజ్యసభ సభ్యురాలు స్వాతి మలైవాల్ ని పార్టీ నుండి సాగనంపారు.అంతకుముందుఆమ్ఆద్మీ పార్టీ పెట్టిన తొలినాళ్ళలో యోగేంద్ర యాదవ్,కిరణ్ బేడీ లాంటి ప్రశ్నించే మేదావులను పొమ్మనకుండానే పొగ పెట్టారు. ప్రత్యర్థులపై ప్రశ్నలు వర్షం కురిపించే కేజ్రీవాల్ విచిత్రంగా తమపార్టీ నేతలు ప్రశ్నలు,ఎదుగుదలను సహించలేక పోవడం అనేది ఆయనకు ఆకస్మికంగా వచ్చిన మార్పు కాదు.ఆయనలో దీర్ఘకాలికంగా ఉన్న జబ్బునే? అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా వచ్చిన క్రేజ్ ను వాడుకొని అధికారం లోకి వచ్చిన కేజ్రీవాల్ ఆమ్ఆద్మీపార్టీ ని ఓప్రజాస్వామ్య పార్టీగా మలచడం లో విఫలం అయ్యాడు.నిర్థిష్టంగా ఆమ్ఆద్మీపార్టీ కి ఒక రాజకీయ విధానంకానీ , నిర్మాణం కానీ లేదు.వ్యక్తిపూజను అధికారిక ఎజెండాగా చేసిన పార్టీలలో జాబితాలో ఆమ్ఆద్మీపార్టీ ఏనాడో చేరిపోయింది.అంతేకాదు ఆపార్టీకి ఏకైక ఏజెండా కేజ్రీవాల్ తప్ప ఒక నిర్దిష్ట రాజకీయ విధానం కానీ, సిద్దాంతం కానీ లేదు,కనీస ప్రజాస్వామ్య నిర్మాణం గానీ లేదు.ఆమ్ఆద్మీపార్టీలో సంస్థాగత సమావేశాలు, ఎన్నికలకు ఆవగింజంత చోటు గానీ,కార్యకర్తలు అభిప్రాయాలను గౌరవించడంఅనే అనవాయితీ లేదు.ఆన్లైన్ మిస్డ్ కాల్ సభ్యత్వం హడావిడి తప్ప పార్టీ యూనిట్లను ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నిక చేసింది లేదు.జాతీయకమిటీల నుండి స్థానిక కమిటీ వరకు అన్ని కేజ్రీవాల్ కనుసన్నల్లో కాగితం నియమకాలే తప్ప!ఏనాడు ఆపార్టీ కార్యకర్తలు అభిప్రాయాలకు వేదిక లేదు? రెండేళ్లకు ఒకమారు జాతీయ కౌన్సిల్ జరిపినా అందులోకూడాకేజ్రీవాల్ ప్రసంగం వినడం తప్ప చర్చలు,అభిప్రాయాలకు తావులేదు.ఒక ఆర్థిక, రాజకీయ ఎజెండా స్పష్టత కూడా ఇంతవరకు లేదు.జాతీయ పార్టీగా గుర్తింపు పొందిన తర్వాత కూడా ఆమ్ఆద్మీపార్టీ విధానాల్లో మార్పులేదు.ఆప్ జెండా విషయంలో అదే గందరగోళం నెలకొంది.మొదటతెల్లజెండా, తర్వాతపసుపు పచ్చజెండా, తర్వాత పచ్చజెండా క్రింద బులుగు రంగు.ఇక రాజకీయ పరమైన విధానాల్లో కూడా అంతే.ఒకవైపు భగత్ సింగ్, అంబేద్కర్ బొమ్మలు కుడి,ఎడమలో పెట్టు కుంటారు.మరోవైపు వంద రూపాయల నోటు మీద సరస్వతి, లక్ష్మీదేవి, వినాయకుడు బొమ్మలు ముద్రించాలని బిజెపిని డిమాండ్ చేస్తాడు. జైభజరంగ్ బలీ అంటాడు, అంతలోనే ఇంక్విలాబ్ జిందాబాద్ అంటాడు. అసలు ఈయన సెక్యులరిస్టా?మతవాదం గూడుకట్టుకున్న మరో రూపమా?స్పష్టత లేదు.అంతేకాదు. ఆయన రాజకీయ విదానాలు వివాదాస్పదమే! ఆమ్ఆద్మీపార్టీ ఎవరితో పొత్తులు లేకుండా.దేశవ్యాప్తంగా విస్తరిస్తాము అంటూనే, తనపై బిజెపి ప్రభుత్వం కేసులు పెడుతున్న సమయంలో ఇండియా కూటమిలో భాగస్వామ్యం అయ్యాడు. ప్రాంతీయ పార్టీలకు మద్దతు కూడగట్టి ప్రధాని కావాలనే ఆలోచనతోనే చంద్రబాబు నాయుడు, కేసీఆర్,శివసేన, మమతా బెనర్జీ, తదితరులతో జట్టు కట్టే ప్రయత్నం చేశారు.చివరకు ఇండియా కూటమిలో చేరి పోటీ చేసినా కనీసం తాము అధికారం లో ఉన్న డిల్లీ లో ఒక్క స్థానం గెలవకపోగా పంజాబ్ లోకూడా చావుతప్పి కన్నులొట్టపోయి మూడు స్థానాల్లో మాత్రమే విజయం సాధించాడు.అటుతర్వాత ఆయన సొంత రాష్ట్రం హర్యానా లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమిలో ఉండి స్వతంత్రం గా పోటీ చేయడంవలన కాంగ్రెస్ ఓటమికి నాంది పలికాడు.సొంతంగాడ పాజిట్లుదక్కలేదు?పర్యవసానంగా డిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అదేపాత్ర నిర్వర్తించడం తో పరాజయం పాలవ్వడమేకాక తానుకూడా శాసనసభ్యుడు గా కూడా గెలవలేక ఓడిపోయాడు.ఇవన్నీ కేజ్రీవాల్ స్వయం కృత రాజకీయ అపరాదాలే తప్ప ఆమ్ఆద్మీపార్టీ ఓటమి కాదు.ఒకవైపు బిజెపి కాంగ్రెస్ బిటీం అని,మరోవైపు కాంగ్రెస్, బిజెపి బీటీం అని ప్రచారం చేస్తుంటే,కాదు నాది స్వతంత్ర టీం అని చెప్పుకోలేని రాజకీయ సందిగ్ధ,అసంబద్ధ స్థితిలో ప్రస్తుతం కేజ్రీవాల్ ఉన్నారు.వచ్చిన అధికారం, అవకాశాలు జాతీయ స్థాయిలో నిలుపుకునే నిర్మాణం గానీ, ప్రజాస్వామ్య విధానం కానీ ఆయనలో కనిపించదు.అనుభవం నుండి నేర్చుకున్నది లేదు.

## తెలంగాణ ప్రభుత్వ ఆస్పత్రుల్లో హెల్త్ ఏటీఎంలు..




హైద్రాబాద్: రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకుచ్చేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే టెక్నాలజీతో కూడుకున్న హెల్త్ ఏటీఎంలను.. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద రెండు ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురాగా.. ఇవి విజయవంతం కావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు రెడీ అవుతోంది.ఔట్ పేషెంట్లు అధికంగా ఉండే ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను తీసుకురావాలని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. హెల్త్ ఏటీఎంలుగా పిలుస్తున్న ఈ ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్టింగ్ మెషీన్లను త్వరలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి, మలక్‌పేట ఏరియా ఆస్పత్రుల్లో హెల్త్ ఏటీఎంలను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసి పరీక్షించారు. ఇవి పూర్తిగా సక్సెస్ కావడంతో మరిన్ని ఆస్పత్రులకు విస్తరించేందుకు చర్యలు చేపట్టారు.రోగ నిర్ధారణలో ఈ హెల్త్ ఏటీఎంలు కచ్చితత్వాన్ని చూపిస్తుండటంతో ఆశాభావం వ్యక్తం అవుతోంది. ఈ హెల్త్ ఏటీఎంలలో టెస్ట్‌లు చేయించుకున్న రోగుల నమూనాలను.. టీ డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపించారు. ఇక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో కూడా మెడికల్ టెస్ట్‌లు నిర్వహించారు. హెల్త్ ఏటీఎంలలో వచ్చిన ఫలితాలు.. ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లలోనూ రావడంతో.. ఈ హెల్త్ ఏటీఎంల పనితీరు బాగుందని అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలోని మరిన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించి.. ఒక రిపోర్టును అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు.పేషెంట్ల రద్దీ అధికంగా ఉంటే ఆస్పత్రుల్లో ఈ హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు వేగంగా ఆరోగ్య సేవలు అందించవచ్చని చెబుతున్నారు. నిమిషాల వ్యవధిలోనే ఈ హెల్త్ ఏటీఎంలు 132 రకాల మెడికల్ టెస్టులను ఆటోమేటిక్‌గా చేస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. డాక్టర్‌తో సంబంధం లేకుండా అన్ని ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను పూర్తి చేయనున్నాయి. అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ మెడికల్ పరికాలతో పనిచేసే ఈ హెల్త్ ఏటీఎంలు.. రోగుల శరీరాన్ని స్కాన్ చేసి.. బీపీ, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు.. బరువు, ఎత్తు, శరీర ఉష్ణోగ్రత వంటి వాటిని వేగంగా కొలిచేందుకు ఉపయోగపడతాయి మరోవైపు.. మలేరియా, డెంగ్యూ, యూరిన్, కొలెస్ట్రాల్, ఈసీజీ, షుగర్, హెచ్‌బీడీ వంటి ర్యాపిడ్ టెస్టులు వేగంగా చేస్తాయి. ఇక రోగుల డిజిటల్ హెల్త్ రికార్డ్‌ను కూడా తయారు చేసి భద్రపరుస్తుంది. ఇక మెడికల్ టెస్టులు పూర్తైన తర్వాత దీని ద్వారానే డాక్టర్‌తో మాట్లాడుకోవచ్చు. ఒక ప్రైవేట్ సంస్థ ఈ హెల్త్ ఏటీఎం మెషీన్లను డెవలప్ చేయగా.. 2 నెలల పాటు పరీక్షించారు. ఈ హెల్త్ ఏటీఎంల వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్ల కోసం వేచి చూసే పని లేకుండా వేగంగా రోగులకు సేవలు అందనున్నాయి.

## భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శం



యాదాద్రి, భువనగిరి: రాష్ట్రంలోని భరోసా కేంద్రాల పని తీరు దేశంలోనే ఆదర్శంగా ఉందని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసులు సైతం భరోసా కేంద్రాల నిర్వహణను అధ్యయనం చేసి వెళుతున్నారని తెలిపారు. భువనగిరిలో జిల్లా పోలీస్ కార్యాలయం, భరోసా కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస, బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగికదాడి, పోక్సో కేసుల విచారణలో పోలీసుల కంటే భరోసా కేంద్రాల పాత్ర కీలకమని తెలిపారు. బాధితులైన మహిళలు, బాలికలు పోల?సస్టేషన్‌లో కొంత భయం, బెరుకుతో ఇబ్బందిపడి తమపై జరిగిన దాడులు, దౌర్జన్యాలను ధైర్యంగా చెప్పలేకపోతారన్నారు. భరోసా కేంద్రాల్లో అలాంటి వాతావరణం ఉండకపోవడంతో సైకాలజిస్టులకు నిర్భయంగా జరిగింది జరిగినట్టు చెప్పగలుగుతారని వివరించారు. కేసుల నమోదు నుంచి, విచారణ, చార్జీషీట్ తదుపరి నిందితులకు శిక్ష పడేవరకు భరోసా కేంద్రం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో 2015-16నుంచి ఏర్పాటుచేసిన భరోసా కేంద్రాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. మహిళలపై దాడులు వంటి కేసుల్లో కీలకంగా మారిన భరోసా కేంద్రాలకు రాష్ట్రంలో 35 భవనాలను నిర్మించామన్నారు.దేశంలోని అగ్రగామి పోలీస్ వ్యవస్థల్లో తెలంగాణ పోలీస్ ప్రముఖంగా ఉంటుందని డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ ఎం. భగవత్ అన్నారు. జిల్లా ఎస్‌హెచ్‌ఓపై స్థాయి అధికారులతో నిర్వహించిన ఇంటరాక్ట్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో మావోయిస్టు నాయకులు దాదాపు లొంగిపోయి జనజీవన స్రవంతిలోకి వచ్చారని, తెలంగాణకు చెందిన వారు కేవలం ఆరుగురు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోల?నశాఖకు జిల్లా పాలన యంత్రాంగం సహాయపడుతుందన్నారు. ఎస్పీ అక్షాంశ్‌యాదవ్ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులు సమర్థంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్, భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ డీఎస్పీలు రవీందర్, శ్రీనివ్ష?సనాయుడు, పి. మధుసూదన్‌రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వమే చిరునామా



చిన్న చింతకుంట : మహిళలు కేవలం వంటగదికే పరిమితం కాకుండా ఆర్థికంగా ఎదిగి సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అన్నారు.మండల కేంద్ర పరిధిలోని లాల్ కోట గ్రామంలో చిలుకటి సునీత నర్సింహులు ఏర్పాటు చేసిన విజయ డెయిరీ తెలంగాణ పార్లర్ ను, తెలంగాణ రాష్ట్ర డైరీ అభివృద్ధి సహకార సమాఖ్య ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు ఈ ఏడాది రూ. 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించామని, రాబోయే కాలంలో దీనిని రూ. లక్ష కోట్లకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా, మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి వారిని బస్సులకు యజమానులుగా మారుస్తున్నామన్నారు. స్కూల్ యూనిఫాంల తయారీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, పౌల్ట్రీ వంటి రంగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. మూసాపేట్ మండల కేంద్రంలో మూతపడిన పాల శీతలీకరణ కేంద్రాన్ని పునఃప్రారంభించాలని ఎమ్మెల్యే కోరగా ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్ర అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 10 నుంచి అసలైన ఎండలు..

హైద్రాబాద్: ఎండాకాలం మొదలైన తర్వాత ఆకస్మిక వర్షాలు కురుస్తుండటం చూస్తూనే ఉన్నాం. అదే సమయంలో భానుడి భగభగలు కూడా నమోదు అవుతున్నాయి. వడగండ్ల వానలతోపాటు.. ఎండలు కూడా భారీగానే ఉంటున్నాయి. ఈ క్రమంలోనే పూర్తి స్థాయి వేసవి కాలం.. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురిసి వాతావరణం కాస్త ప్రశాంతంగా ఉన్నప్పటికీ.. ఏప్రిల్ 10వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోనున్నాయని హెచ్చరిస్తున్నారు.రానున్న 10 రోజుల్లో తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై భానుడి ప్రతాపం మరింత ఎక్కువగా ఉండనున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని ప్రజలు ఎండల పట్ల అలర్ట్‌గా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.మరీ ముఖ్యంగా సింగరేణి ప్రాంతాల్లో ఎండలు భీకరంగా ఉండనున్నాయని పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు కూడా 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక హైదరాబాద్‌లో కూడా భానుడి ప్రభావం అధికంగానే ఉండనున్నట్లు తెలిపారు. హీట్ ఐలాండ్ ప్రభావంతో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును చేరుకోనున్నట్లు అంచనా వేస్తున్నారు.తీవ్రమైన వేడి కారణంగా స్థానికంగా ఏర్పడే అల్పపీడన ద్రోణుల కారణంగా.. అక్కడక్కడా ఉరుములతో కూడిన వడగళ్ల వానలు కూడా కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఆ వర్షాలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తాయని.. భూమిలో వేడి పెరగడం వల్ల వర్షం పడిన తర్వాత మరింత ఉక్కపోత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.మరోవైపు.. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. కామారెడ్డి, ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలకు రైతులకు చేతికొచ్చిన తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం రోజున ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

## బంజారాలకు సముచిత గౌరవం

హైదరాబాద్: తాము స్థాపించబోయే కొత్త పార్టీలో బంజారా సమాజానికి సముచిత గౌరవం, రాజకీయ అవకాశాలు కల్పిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ తో పాటు పలువురు బంజారా ప్రముఖులతో నాయక్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో బంజారా సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, వారి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై వారితో ఆమె చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కూడా ఎప్పుడు మంత్రివర్గంలో బంజారాలకు ఎప్పుడూ ప్రాతినిథ్యం ఉందనీ, అయితే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గంలో బంజారాలకు స్థానం కల్పించలేదని మండిపడ్డారు. కొత్త పార్టీ విధివిధానాల రూపకల్పనలో బంజారా మేధావులు, ప్రముఖులు తమ అమూల్యమైన సలహాలు అందించాలని కోరారు.ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని ఆకాంక్షించే బంజారా యువతకు, నాయకులకు తమ పార్టీ సాదర స్వాగతం పలుకుతుందన్నారు. సమావేశంలో బంజారా ప్రముఖులు, ట్రైబల్ వెల్ఫేర్ మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి లక్ష్మణ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ సింగ్ నాయక్, కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ భీమ్లా నాయక్, బస్కీ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి హరి నాయక్, ఎలక్ట్రిసిటీ బోర్డు ట్రైబల్ వింగ్ అధ్యక్షులు నారాయణ, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మీడియా సెక్రెటరీ భీముడు నాయక్, ఎలక్ట్రిసిటీ డీఈఈ బాలాజీ నాయక్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్ సింగ్ నాయక్, జాగృతి నాయకులు మోహన్ నాయక్, కళ్యాణ్ నాయక్, సక్రు నాయక్, రవి రాథోడ్, శివ నాయక్, రాంజీ నాయక్, మహేందర్ నాయక్, మానుకోట కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 'రాజాసాబ్' తర్వాత గాయబ్



ప్రభాస్‌తో సినిమా అంటే అభిమానులే కాదు.. అందులో భాగమైన వాళ్లు కూడా చాలా ఆశలు పెట్టుకుంటారు. పాన్ ఇండియా స్థాయిలో తమకు పేరొస్తుందని.. అవకాశాలు వరుస కట్టేస్తాయని నటీనటులు, సాంకేతిక నిపుణులు భావిస్తారు. 'రాజాసాబ్' మీద కూడా అందరూ అలాంటి ఆశలే పెట్టుకున్నారు. కానీ ఈ సినిమా అంచనాలను అందుకోలేకపోవడం, తీవ్ర విమర్శలు ఎదుర్కొని చివరికి సోషల్ మీడియాలో ట్రోల్ మెటీరియల్‌గా మారిపోవడంతో అందరి ఆశలూ అడియాసలయ్యాయి. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ భారీ నష్టాన్ని ఎదుర్కొని.. ప్రొడక్షన్ వేగం తగ్గించేశారు. దర్శకుడు మారుతికి ఇంకో పెద్ద సినిమా దక్కే అవకాశం లేక చిన్న చిత్రంతో అడ్జస్ట్ అవుతున్నాడు. ఇక 'రాజాసాబ్'తో తమ కెరీర్లు మారిపోతాయని ఆశించిన హీరోయిన్లు ముగ్గురు ఇప్పుడు ఇండస్ట్రీ నుంచే గాయబ్ అయిపోయే సంకేతాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది 'హరిహర వీరమల్లు'తో కంగుతిన్న నిధి అగర్వాల్‌కు 'రాజాసాబ్'తో మరో షాక్ తగలడంతో ఆమె మీద డిజాస్టర్ హీరోయిన్ అని ముద్ర పడిపోయింది. 'రాజాసాబ్' రిలీజ్‌కు ముందు మూడు సినిమాల్లో ఛాన్స్ వచ్చిందని, ఈ మూవీ రిలీజయ్యాక వాటి వివరాలు వెల్లడిస్తానని చెప్పింది నిధి. కానీ 'రాజాసాబ్' విడుదలై రెండు నెలలు గడుస్తున్నా ఆ కబుర్లేవీ బయటికి రాలేదు. ఇక ఎప్పుడో తెలుగు సినిమాల్లోకి అడుగు పెట్టాల్సిన మాళవిక మోహనన్ చివరికి 'రాజాసాబ్' లాంటి పెద్ద సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఇందులో ఆమె పెద్దగా ప్రభావం చూపకపోవడంతో కొత్త ఛాన్సులు వస్తున్న సంకేతాలేమీ కనిపించడం లేదు. మూడో హీరోయిన్ రిద్ధి కుమార్ గురించి అయితే అసలు డిస్కషనే లేదు. సినిమాలో తన పాత్ర, నటన తేలిపోవడంతో తనకు మైనస్ మార్కులే పడ్డాయి. ముగ్గురూ పోటీ పడి గ్లామర్ విందు చేసినా.. అది సినిమాకు పెద్దగా ఉపయోగపడలేదు. ఫలితాన్ని మార్చలేదు. ఇప్పుడు 'రాజాసాబ్' హీరోయిన్లు ముగ్గురూ అవకాశాలు లేక ఖాళీ అయిపోయిన పరిస్థితే కనిపిస్తోంది.

# ఇండస్ట్రీలో కొత్త డైరెక్టర్ల పరిస్థితి ఇది



కొత్త టాలెంట్ రావాలి, క్రియేటివిటీకి పదును పెట్టాలనేది ఇండస్ట్రీలో రెగ్యులర్ గా వినిపించే మాట. ఎవరి దగ్గరైనా మంచి కథ ఉంటే నేరుగా వచ్చి మమ్మల్ని కలవండని చెప్పే ప్రొడ్యూసర్లు వందల సంఖ్యలో ఉంటారు. కానీ గ్రౌండ్ లెవెల్ పరిస్థితి వేరుగా, ఇంకా చెప్పాలంటే చేదుగా ఉంటుందనేది వాస్తవం. అయితే దీని గురించి అందరూ నోరు విప్పరు. ఎవరేం అనుకుంటారో, ఎక్కడ ఇబ్బంది పెడతారో అనే ఉద్దేశంతో లోలోపల బాధపడి కుమిలిపోయేవాళ్లే ఎక్కువ. కొందరు మాత్రం ఉండబట్టలేక తాము అనుభవించిన క్షోభను బయట పెడతారు. సాంప్రదాయినీ సుప్పిని సుద్దపూసని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ అందులో ఒకరు. ఆయన అనుభవం ఇలా ఉంది...తాను రాసుకున్న స్టోరీని పెద్ద బ్యానర్లకు చెప్పే ఉద్దేశంతో సుధీర్ శ్రీరామ్ పలు అగ్ర సంస్థల ప్రతినిధులను కలుసుకునే ప్రయత్నం చేశారు. సితార ఎంటర్ టైన్మెంట్స్ కోసం ట్రై చేస్తే ఈ వ్యవహారాలు చూసుకునే వ్యక్తి అసలు ఆసక్తినే చూపించలేదు. పైకేదో విందాం అనే మాటే కానీ ఇంటరెస్ట్ లేదనే విషయం అర్థమైపోయింది. గీతా ఆర్ట్స్ కోసం ఇదే తరహాలో కథ నెరేట్ చేయడానికి ట్రయిల్స్ వేస్తే అక్కడి రెప్రెజెంటేటివ్ ఆఫీస్ దగ్గర ఉండి కూడా దూరంలో ఉన్నానని అబద్ధం చెప్పడం అసలు ట్విస్టు. అన్నపూర్ణ వెనుక వైపు ఆఫీస్ నడిపే మరో చోట కూడా ఇదే తరహా ఎక్స్ పీరియన్స్ చవి చూడాల్సి వచ్చింది. ఉదయం ఎనిమిదికి రమ్మన్నారు. బయలుదేరేముందు ఫోన్ చేస్తే వచ్చెయ్ అన్నారు. అక్కడికి చేరుకొని రెండు మూడు గంటలు వెయిట్ చేశాక తాపీగా సదరు వ్యక్తి వైజాగ్ ఫ్లైట్ లో ఉండటం వల్ల చెప్పలేకపోయానని చావు కబురు చల్లగా చెప్పాడు. విమానంలో ప్రయాణం అంటే అప్పటికప్పుడు నిమిషాల్లో నిర్ణయించుకుని వెళ్ళేది కాదు. అలాంటప్పుడు కథ చెప్పాలని వచ్చిన దర్శకుడికి ఆ నిజమేదో చెప్పేస్తే ఇబ్బంది పడే అవసరం ఉండదు కదా. అసలు ఇంతగా దోబూచులాడాల్సిన అవసరం ఏముందనేది వర్ధమాన డైరెక్టర్లు అడుగుతున్న సూటి ప్రశ్న. దీని పైన దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉంది. కొత్తవాళ్లను ఎంకరేజ్ చేయకపోయినా పర్వాలేదు కానీ ఇలా తిప్పించుకుని తప్పించుకోవడం మాత్రం సబబు కాదు. ఒకవేళ అవకాశం ఇచ్చే ఉద్దేశం లేకపోతే మొహం మీద చెప్పేస్తే వేరే ఆప్షన్లు చూసుకుంటారు. అంతే తప్ప ఇలా రా అని చెప్పి హ్యాండ్ ఇచ్చి వాళ్ళను వ్యయప్రయాసలకు గురి చేయడం ఇండస్ట్రీలో ఇతరుల మీద నమ్మకాన్ని పోగొడుతుంది. ఇది సదరు నిర్మాణ సంస్థలు, వాటి అధిపతులు కావాలని చేసింది కాకపోయినా వాళ్లను రిప్రెజెంట్ చేస్తున్న మనుషుల వల్ల ఎంతో కొంత చెడ్డ పేరు అయితే వస్తోంది. దీన్ని సరిచేయాల్సిన బాధ్యత దర్శకులది కాదు నిర్మాతలదే.

# మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం

ఆసిఫాబాద్, : జిల్లాలో మహిళలు, చిన్న పిల్లల భద్రత కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. మహిళలు, యువతులు ఎటువంటి హింసకు గురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, భరోసా కేంద్రాల ద్వారా మహిళల రక్షణకు కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యార్థినులు, మహిళలకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి నెలలో జిల్లావ్యాప్తంగా షీ టీం ద్వారా 71 హాట్‌స్పాట్ ప్రాంతాలను గురించి 20 అవగాహన కార్యక్రమాలు నిర్వ హించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరుగురిని రెడ్‌హ్యాండ్‌గా పట్టుకుని వచ్చిన ఫిర్యాదుల్లో నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి ఒక కేసులో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హింసకు గురైన వారు నేరుగా పోలీసులను సంప్రదించలేని పరిస్థితుల్లో షీ టీంలను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో రెండు షీ టీంలు పని చేస్తున్నాయని ఆసిఫాబాద్( 8712 670564), కాగజ్‌నగర్ (87126705 65) లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 12 ఫిర్యాదు లను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుం డా నిర్భయంగా పోలీసు సేవలను వినియో గించుకోవాలని, ప్రతీ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుం దని తెలిపారు.

## సినిమా థియేటర్లలో కొత్త సిస్టమ్

హైద్రాబాద్: తెలుగు సినిమా ప్రదర్శన రంగంలో ఒక కీలక పరిణామంగా, తెలంగాణలోని 23 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఏప్రిల్ 3, 2026 నుండి పూర్వపు అద్దె విధానాన్ని రద్దు చేసి, పర్సెంటేజ్ ఆధారిత స్క్రీనింగ్ విధానాన్ని అవలంబించనున్నట్లు ప్రకటించాయి. తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జారీ చేసిన సర్క్యులర్ ద్వారా ఈ నిర్ణయం అధికారికంగా ప్రకటించబడింది. నోటీసులో పేర్కొన్న విధంగా, ప్రధాన ప్రాంతాల్లో మెరుగైన సౌకర్యాలు మరియు ప్రేక్షకుల సౌకర్యంతో ఉన్న థియేటర్లలో పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, సిబ్బంది వేతనాలు వంటి కారణాల వల్ల అద్దె విధానాన్ని కొనసాగించడం కష్టంగా మారిందని ఎగ్జిబిటర్లు తెలిపారు. సినిమా హాళ్ల స్థిరమైన మనుగడను సునిశ్చితం చేయడానికి, వారు బాక్సాఫీస్ ఆదాయంపై ఆధారపడి ఆదాయ–భాగస్వామ్య విధానాన్ని ఎంచుకున్నారని తెలిపారు. భారతదేశంలో సింగిల్–స్క్రీన్ థియేటర్లు మల్టీప్లెక్స్‌లతో పోటీ పడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ, పెరుగుతున్న ఆర్థిక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని చాంబర్ స్పష్టం చేసింది.

# మహిళా సంఘాలకు మరో 40 పెట్రోల్ బంకులు..





హైద్రాబాద్: తెలంగాణలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పదే పదే చెబుతూనే ఉంది. ఇందులో భాగంగానే మహిళలకు ఉద్యోగాలతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇందిరా మహిళా శక్తి పథకం కింద.. మహిళా సంఘాలకు ఉపాధి మార్గాలు చూపిస్తోంది. ఈ క్రమంలోనే పూర్తిగా మహిళల ఆధ్వర్యంలోనే నడిచేలా తెలంగాణలో 2 పెట్రోల్ బంకులను ఇప్పటికే ఏర్పాటు చేయగా.. అవి లాభాలతో కళకళలాడుతున్నాయి. దీంతో ఇతర జిల్లాల్లోనూ ఏర్పాటు చేసి.. మహిళా శక్తిని చాటాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పెట్రోల్ బంకుల్లో సిబ్బంది, మేనేజర్లు, ఆపరేటర్లు చివరికి ఓనర్లు కూడా అందరూ మహిళలే కావడం గమనార్హం. ఇప్పటివరకు ఇందిరా మహిళాశక్తి పథకం కింద సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. వాటికి మంచి లాభాలు వస్తుండటంతో.. మిగిలిన జిల్లాల్లోనూ వీటిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా మరో 40 చోట్ల మహిళా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ పెట్రోల్ పంపుల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేసింది. త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనుండగా.. వీటి కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కూడా చేసుకుంది. ఇందులో దాదాపు సగం అంటే 20 పెట్రోల్ బంకులను.. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) యోచిస్తోంది. ఆదిలాబాద్‌లోని కైలాష్‌నగర్.. నల్గొండ జిల్లా గండవారిగూడెం, కుమురం భీమ్ జిల్లా ఆసిఫాబాద్, పెద్దపల్లి జిల్లా భూపతిపురం, వికారాబాద్ జిల్లా హకీంపేట్ దుద్యాల్‌లలో కొత్త పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసేందుకు పనులు మొదలయ్యాయి. వీటితోపాటు కరీంనగర్, మెదక్, ములుగు, సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లోనూ కొత్త బంకులు రానున్నాయి. హనుమకొండ జిల్లా మడికొండ.. ఖమ్మం జిల్లా వెంకటాపురం, సాదిరెడ్డిపల్లి, ఖానాపురం హవేలి.. కామారెడ్డి జిల్లా మల్తుమ్మెద.. కొత్తగూడెం జిల్లా రామవరం, కొత్తగూడెం.. జనగామ జిల్లా రఘునాథపల్లి.. జగిత్యాల జిల్లా కోరుట్ల.. భూపాలపల్లి జిల్లా మైలారం.. మహబూబ్‌నగర్ జిల్లా పాలకొండ.. మేడ్చల్ జిల్లా అలియాబాద్.. మంచిర్యాల జిల్లా మందమర్రి.. నిర్మల్ జిల్లా సోఫానగర్.. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు, పెద్దాపూర్.. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్, వట్టినాగులపల్లి.. వనపర్తి జిల్లా మిరాస్‌పల్లి.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్.. వరంగల్ జిల్లా రాయపర్తి.. భువనగిరి జిల్లా మల్కాపురం.. సంగారెడ్డి జిల్లా కవేలి, కోడూరులలో ఇప్పటికే కొత్త పెట్రోల్ పంపుల కోసం భూములను సేకరించి మహిళా సంఘాలకు అప్పగించారు. మరోవైపు.. సిద్దిపేట, నిజామాబాద్, భువనగిరి, జోగులాంబ గద్వాల్ జిల్లా నారాయణపురం, భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం, సూర్యాపేట జిల్లా రేపాల, మహబూబాబాద్ జిల్లా తానంచెర్లలో భూములను గుర్తించగా.. మహిళా సంఘాలకు ఇంకా అప్పగించాల్సి ఉంది.

# డిజిటల్ చెల్లింపుల వివరాల సేకరణకు ప్రభుత్వం కసరత్తు – రెవ్ వన్ పేరుతో ఏకీకృత పోర్టల్

హైద్రాబాద్: డిజిటల్ చెల్లింపుల వివరాల సేకరణకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. చట్టం తీసుకురావడం కోసం అధ్యయనం చేయడానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా కమిటీ నియమించింది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల మధ్య పరస్పర డేటా మార్పిడి, పర్యవేక్షణ కోసం రెవ్ వన్ పేరుతో ఏకీకృత పోర్టల్‌ను త్వరలోనే ఏర్పాటు చేయనుంది. వినోద పన్ను వసూలు చేయడానికి స్థానిక సంస్థలకు అవకాశం కల్పించడంపైనా సీఎస్ నేతృత్వంలోని కమిటీ సాధ్యసాధ్యాలను పరిశీలించనుంది. సరికొత్తగా 'రెవ్ వన్' పోర్టల్ : ఆదాయ లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, రిజిస్ట్రేషన్లు తదితర శాఖల నుంచి రావాల్సిన ఆదాయానికి ఎక్కడ గండిపడుతుందనే అంశాన్ని కొంత కాలంగా ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. పూర్తి అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రవాణా వంటి కీలక శాఖల వద్ద ఉన్న డేటా ఆయా శాఖలకే పరిమితమవుతోంది. ఈ కారణంగా ట్యాక్స్ చెల్లించకుండా తప్పించుకునే అవకాశం ఉంటుంది. దీనిని అరికట్టేందుకు సరికొత్తగా 'రెవ్ వన్' పోర్టల్ ద్వారా అన్ని శాఖల డేటాను పాన్ నంబర్ ఆధారంగా అనుసంధానించనున్నారు. యూనివర్సల్ ఏపీఐ విధానంలో ఈ వ్యవస్థను రూపొందించి రియల్ టైమ్ ప్రాతిపదికన డేటాను అనాలసిస్? చేస్తారు. డిజిటల్ లావాదేవీలపై నిఘా : గత మూడు నాలుగేళ్ల నుంచి అత్యధికంగా నగదు రహిత లావాదేవీలు పెరిగిన నేపథ్యంలో యూపీఐ, పీఓఎస్ వంటి డిజిటల్ మాధ్యమాల ద్వారా జరిగే బీ2సీ వ్యాపార విక్రయాల డేటాను సేకరించడంపై సర్కారు దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా రక్షణ చట్టం నిబంధనలను ఉల్లంఘించకుండా డిజిటల్ లావాదేవీలపై నిఘా పెట్టే అవకాశాలపై కమిటీ అధ్యయనం చేయనుంది. వినోద పన్నును పంచాయతీలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు వసూలు చేసే సాధ్యాసాధ్యాలపై కూడా ఈ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనుంది. సర్కారు ఖజానాకు అదనపు ఆదాయం : 101వ రాజ్యాంగ సవరణను పరిగణనలోకి తీసుకుని స్థానిక సంస్థలు ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్ వసూలు చేసే అవకాశాలను కమిటీ పరిశీలిస్తుంది. ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధి విధానాలను అధ్యయనం చేసి తగిన సిఫార్సులు చేయనుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో రెవెన్యూ, ఐటీ, ఆర్థిక, మున్సిపల్, రవాణా, గనులు, న్యాయ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు సభ్యులుగా ఉంటారు. సాంకేతిక అవసరాల కోసం కన్సల్టెంట్లను నియమించుకునేందుకు కూడా కమిటీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కమిటీ 30 రోజుల్లో ప్రాథమిక, 60 రోజుల్లోగా తుది నివేదికను సమర్పించనుంది. కొత్త వ్యవస్థ అమల్లోకి వస్తే పన్నుల వసూళ్లలో పారదర్శకత పెరగడమే కాకుండా సర్కారు ఖజానాకు అదనపు ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



హైద్రాబాద్: రాజకీయాలకు తావు లేకుండా అన్ని కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కాప్రా, శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధి పనులకు ప్రభుత్వము మంజూరు చేసిన 20 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీలను శనివారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ లు శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్ రెడ్డికి కి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు, కాలనీ సంక్షేమ సంఘాలు ఎలాం టి సమస్యలు ఎదురైనా తమను సంప్రదించాలని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు శంకర్రావు, సుబ్బారావు, సంతోష్‌లు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త టెస్ట్..

హైదరాబాద్, : రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా అతివేగం, నిర్లక్ష్యం, రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన లేకుండా వాహనాలు నడుపుతుండటం వల్ల జరుగుతున్నవే ఉంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య లక్షకుపైగానే ఉంటోంది. ఈ నేపథ్యంలో, యాక్సిడెంట్ల నివారణకు వీలుగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని ఇటీవల సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాల్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా డ్రైవింగ్ లైసెన్సు జారీలో మూడంచెల విధానం అమల్లోకి తేవాలని భావిస్తోంది. సాధ్యాసాధ్యాల్ని పరిశీలించి సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించేందుకు రవాణాశాఖలో వివిధ విభాగాల నుంచి ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసారు. కమిటీ నివేదిక ఈ నెలాఖరుకు వచ్చే అవకాశం ఉంది. నివేదిక అందిన తర్వాత అన్ని అంశాల్ని పరిశీలించి వీలైనంత త్వరగా నూతన విధానం అమలు చేసేందుకు రవాణా శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సు జారీలో ప్రస్తుతం రెండంచెల విధానం అమల్లో ఉంది. తొలుత లెర్నర్స్ లైసెన్సు రిజిస్ట్రేషన్ (ఎల్ఎల్ఆర్) పరీక్ష, ఆ తర్వాత ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష నిర్వహించి శాశ్వత లైసెన్సు మంజూరు చేస్తున్నారు. వీటికి తోడుగా కొత్తగా ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్ పేరుతో మూడో దశను కూడా ప్రవేశపెట్టనున్నారు. నూతన విధానం అమల్లోకి వస్తే... ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకునే ముందే.. ఆన్‌లైన్ రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్ టెస్ట్‌లో పాస్ కావాల్సి ఉంటుంది. ఈ పరీక్ష రహదారి భద్రతకు సంబంధించిన పలు అంశాలతో కూడి ఉంటుంది. ఆన్‌లైన్ టెస్ట్ కాబట్టి.. ఇంటి నుంచే హాజరుకావచ్చు. దీనిలో పాసైతే ఎల్ఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకుని, ఆ తర్వాత శాశ్వత లైసెన్సు తీసుకోవాలి. రోడ్ సేఫ్టీ అవేర్‌నెస్ మాడ్యూల్స్ టెస్ట్‌లో ఏయే అంశాలను చేర్చాలి, ఎంత సమయం ఆ పరీక్ష నిర్వహించాలి అన్నదానిపై అధ్యయనం జరుగుతోందని, కమిటీ నివేదిక తర్వాత స్పష్టత వస్తుందని రవాణాశాఖ అధికారులు తెలియజేశారు. రోడ్డు ప్రమాదం వల్ల జరిగే నష్టాలు, బాధిత కుటుంబాల ఆవేదన, వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలపై వీడియో క్లిప్పింగ్స్ చూపించి వాటి ఆధారంగా టెస్ట్ ఉండేలా చూస్తున్నామని ఒక అధికారి వెల్లడించారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

పెద్దపల్లి : జిల్లాలో సుమారు 12 వేల మంది విద్యార్థులు రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదువుతున్న వారికి అందించే ఆహార నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ కోయశ్రీహర్ష స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో కేజీబీవీ, గురుకుల విద్యాసంస్థలు, ఆదర్శ పాఠశాలల వంట మనుషులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆహార విషబాధ, వాంతులు, తాగునీటి సమస్యలు తదితర సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పెద్ద సమస్యలుగా మారుతున్నాయని, రాజకీయ కారణాలతో మరింత విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. కూరగాయలు, గుడ్లు, మాంసం వంటి పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయాలని, వంట విధానం, పదార్థాల నాణ్యతపై వంట మనుషులు అత్యంత జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా మాంసాహార వంటకాలు శ్రద్ధతో తయారు చేయాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై కూడా పర్యవేక్షణ అవసరమన్నారు. వంట విషయాల్లో చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచి, చెల్లింపులు సమయానికి చేస్తున్నందున, నిర్ణయించిన మెనూను వంద శాతం పాటించాలని, అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఒకే సాధారణ మెనూను అమలు చేయాలని ఆదేశించారు. గత ఏడాది ముత్తారం కేజీబీవీపీలో జరిగిన ఆహార విషబాధ ఘటన పునరావృతం కాకుండా, రోజు అప్రమత్తంగా ఉండాలని వంట మనుషులకు సూచించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ రెడ్డితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఎనిమిదేళ్ల చిన్నారిని రక్షించిన రియల్ హీరో

## యువకుడికి సజ్జనార్ సన్మానం




హైద్రాబాద్:సమాజంలో నేరాలు జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండకుండా బాధ్యతాయుతమైన పౌరుడిగా స్పందిస్తే ఎంతటి ప్రమాదాన్నైనా నివారించవచ్చని మహ్మద్ ఫిరోజ్ అనే యువకుడు నిరూపించారు. హైదరాబాద్ అబిడ్స్ ప్రాంతంలో ఒక ఎనిమిదేళ్ల పాఠశాల విద్యార్థినిని ఆటో డ్రైవర్ కిడ్నాప్ చేసి వేధిస్తుండగా.. తన ప్రాణాలకు తెగించి ఆ చిన్నారిని రక్షించాడు. మనకెందుకులే అని వదిలేయకుండా చిన్నారిని కాపాడిన ఫిరోజ్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, ప్రశంసా పత్రంతో పాటు నగదు రివార్డును అందజేశారు. ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. ఈ నెల 1న అబిడ్స్ ప్రాంతంలో స్కూల్ ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తున్న 8 ఏళ్ల బాలికను మెహదీపట్నంకు చెందిన ఆటో డ్రైవర్ సలీం మాయమాటలు చెప్పి ఎక్కించుకున్నాడు. ఆ చిన్నారిని గోల్కొండలోని ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. అదే సమయంలో సమీపంలోని మసీదు నుంచి బయటకు వస్తున్న ఫిరోజ్.. ఆటోలో చిన్నారి ఏడుపును గమనించారు. ఏదో అనర్థం జరుగుతుందని అనుమానించిన అతను వెంటనే ఆటోను అడ్డుకున్నారు. ఆటో డ్రైవర్ సలీంను నిలదీయడంతో భయపడిన అతను చిన్నారిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఫిరోజ్ అంతటితో ఆగకుండా.. బాలిక ఐడీ కార్డులోని ఫోన్ నంబర్ ఆధారంగా ఆమె తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించారు. అప్పటికే స్కూల్ వద్ద బిడ్డ కనిపించక ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులకు ఫిరోజ్ ఫోన్ ప్రాణం పోసింది. విధుల్లో ఉన్న అబిడ్స్ బ్లూ కోట్స్ కానిస్టేబుళ్లు సాయికృష్ణ, కేదార్ సింగ్ వెంటనే స్పందించి గోల్కొండకు చేరుకున్నారు. బాలికను సురక్షితంగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కేసులో నిందితుడు సలీంను ఏప్రిల్ 2న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు స్పందించే గుణం గొప్పదని అన్నారు. నేరం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండకుండా ఫిరోజ్ చూపిన చొరవ వెలకట్టలేనిదని ప్రశంసించారు. ప్రతి పౌరుడు ఫిరోజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని.. నేర రహిత సమాజం కోసం పోలీసులతో సహకరించాలని కోరారు. అలాగే సమర్థవంతంగా పనిచేసిన కానిస్టేబుళ్లను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమయానికి స్పందించిన ఫిరోజ్ వల్ల ఒక చిన్నారి జీవితం సురక్షితంగా మిగిలిందని.. ఇలాంటి సాహసాలను ప్రభుత్వం ఎప్పుడూ ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణలో వాలంటీర్ల వ్యవస్థ..

హైద్రాబాద్: తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో భూసారాన్ని కాపాడేందుకు భూసార ఆరోగ్య వాలంటీర్లు ( సాయిల్ హెల్త్ వాలంటీర్లు )ను నియమించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 30 వేల మంది ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లను నియమిస్తామని.. ఇందులో భాగంగానే తొలి విడతలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎంపికైన వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ (ఇక్రిశాట్), తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా ఈ వాలంటీర్లకు శిక్షణ ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఇక్రిశాట్‌లో తొలి విడత సాయిల్ వాలంటీర్లకు ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. తెలంగాణలో రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించి.. సేంద్రియ ఎరువులను వాడటాన్ని పెంచాలని సూచించారు. భూమి రసాయనాలు లేకుండా ఆరోగ్యంగా ఉంటేనే.. పండించిన పంటలో పౌష్టికాహారం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులు జీలుగ, పిల్లిపెసర సహా ఇతర పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూ సారాన్ని పెంచాలని హితవు పలికారు. పంట కోసిన తర్వాత వాటి అవశేషాలను పొలాల్లోనే తగలబెట్టకుండా.. ఎరువులుగా ఉపయోగించాలని రైతులకు మంత్రి తుమ్మల తెలిపారు. భూసార ఆరోగ్య పరిరక్షణను ఒక ఉద్యమంలా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది వాలంటీర్లకు శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో ముగ్గురు వాలంటీర్ల చొప్పున కేటాయించనున్నట్లు వివరించారు. ఈ సాయిల్ హెల్త్ వాలంటీర్లు.. తమ పరిధిలో ఉన్న రైతులకు భూసారం ఎలా కాపాడాలి.. పంటకు భూమిని ఎలా తయారు చేయాలి అనే దానిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులను తీసుకువచ్చే నైపుణ్యాలను నేర్పిస్తారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే రైతు ఉత్సవాల్లో అన్నదాతలు భారీగా పాల్గొనేలా చూడాలని ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంతకుముందు ఇక్రిశాట్‌లోని వ్యవసాయ క్షేత్రాలను ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్.. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సహా పలువురు అధికారులతో కలిసి.. మంత్రి సందర్శించారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం



వరంగల్, : హనుమకొండ 58వ డివిజన్ పరిధి ఎన్జీవోస్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రగా నియోజకవర్గంలో తిరిగినప్పుడు నా దృష్టికి వచ్చిన సమస్యలను, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం జరుగుతుందని తెలిపారు. డివిజన్ల వారిగా పర్యటన చేపట్టి నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల అధికారులు నేరుగా ప్రజల మధ్యనే ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని, ప్రజల సహకారంతో ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజ్, మాజీ కార్పొరేటర్ ఏనుకొంటి నాగరాజు, డివిజన్ అధ్యక్షులు తాళ్లపల్లి సుధాకర్, సోషల్ మీడియా ఇన్చార్జ్ ఎం.డి నేహాల్, కరాబ్ రాజేశ్వర రావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మండల సమ్మయ్య, తాళ్లపల్లి మేరీ, తాళ్లపల్లి రవీందర్ (జెకె), తాళ్ల పెల్లి విజయ్, కాంగ్రెస్ శ్రేణులు తాళ్లపల్లి ప్రసన్నకుమార్, రిషి, స్వాతి, కాలనీవాసులు లక్ష్మీనారాయణ, రవిచంద్ర, వెంకటేశ్వర్లు, ప్రజలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులకు ఎల్లప్పుడూ సహకారం అందిస్తా

మహబూబ్ నగర్ : న్యాయవాదులకు కాంగ్రెస్ పార్టీ తరఫున తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందించడం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేర్కొన్నారు. ఆయన న్యాయవాదుల సంఘం కార్యాలయానికి విచ్చేశారు. ఇటీవల ఎన్నికల్లో గెలిచిన నూతన అధ్యక్ష కార్యదర్శులతో పాటు ఇతర కార్యవర్గాన్ని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఉన్నతమైనటువంటి న్యాయవాద వృత్తి లో ఉంటూ ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తూ నిలవడం ఎంతో గొప్ప విషయం అని ఆయన పేర్కొన్నారు. 1989లో తాను న్యాయవాదిగా పేరును నమోదు చేసుకున్నానని అన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ఒత్తి లోకి రాలేకపోయానని అయినప్పటికీ ఆ న్యాయవాద చదువ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. న్యాయవాదుల పాదయాత్ర ఫలితంతో న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రత్యేక చొరవ తీసుకొని ఆమోదింపచేశారని చెప్పారు. హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి నిలబెట్టుకోవడం జరిగిందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నుకోబడ్డ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆనందరావుకు ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటయ్యలతో పాటు మిగతా కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అనంతరం మాట్లాడుతూ సంఘం కార్యాలయానికి మా తోటి సహచర న్యాయవాదిగా ఉన్నటువంటి వ్యక్తి ఈరోజు జిల్లా అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్ పార్టీ పక్షాన రావడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. అలాగే వారి సహాయ సహకారాలు కూడా ఎప్పుడు న్యాయవాదులకు ఉండేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డితో కలిసి సంఘం అధ్యక్షుడు ఆనందరావు ప్రధాన కార్యదర్శి నరసింహరెడ్డి సంయుక్త కార్యదర్శి సబితా కోశాధికారి రాజు గ్రంథాలయ కార్యదర్శి ప్రభావతి కార్యవర్గ సభ్యులు కృష్ణవంశీ మహేష్ కుమార్ విష్ణు వేద వంశీకృష్ణ మురళీమోహన్ మమత రఘూన్సీలను శాలువాలుతో సన్మానించారు. అనంతరం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆనందరావు కార్యక్రమానికి హాజరైనటువంటి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకుడు మిథున్ రెడ్డి, డిస్ట్రిక్ట్ క్లబ్ ఉపాధ్యక్షుడు సీమ నరేందర్, సభ్యుడు సతీష్ తోపాటు మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గోనెల శ్రీనివాస్ లనుసన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు చంద్రమౌళి పటు తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ దంపతుల ఆత్మహత్య

బెంగళూరు, : భర్త గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మరి కొన్ని నిమిషాలకే అతడి భార్య కూడా బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణలోని సిద్ధిపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కె.భానుచందర్ రెడ్డి(32), బీబీ షాజియా సిరాజ్(31) వివాహం చేసుకుని బెంగళూరులో నివసిస్తున్నారు. బీబీ షాజియా సిరాజ్ కూడా ప్రముఖ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. సోమవారం భర్త భానుచందర్ రెడ్డి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఎంత కొట్టినా తలుపు తెరవ లేదు. దాంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టింది. ఇంతలో గదిలో భర్త భానుచందర్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. అనంతరం బీబీ షాజియా కూడా అపార్ట్‌మెంట్ 17వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు.. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. భానుచందర్ రెడ్డి దంపతుల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. వారి మరణానికి గల కారణాలు తెలియరాలేదు. అధిక ఒత్తిడి, అనారోగ్యం, మానసిక సమస్యలు తదితర కారణాలేమైనా అయ్యిండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తే తప్ప ఈ దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని పోలీసులు వివరించారు. మరోవైపు మృతుల తల్లిదండ్రులు ఇప్పటికే బెంగళూరు చేరుకున్నారు. వీరి మృతితో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# చందమామలో ఎన్నెన్నో వర్ణాలు..

## అనూహ్యమైన రంగుల్ని గుర్తించిన ఆస్ట్రోనాట్స్




టెక్సాస్: ఆర్టెమిస్–2వ్యోమగాములు .. చంద్రుడి ఉపరితలంపై అనూహ్యమైన రంగులను గుర్తించారు. చంద్రుడిని చుట్టువచ్చే క్రమంలో .. చల్లటి జాబిలిపై మల్టీపుల్ కలర్స్ ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చందమామ సమీపం నుంచి బ్రౌన్ రంగులో కనిపించినట్లు చెప్పారు. ఇక అక్కడక్కడ మూన్‌పై గ్రీన్ కలర్ ఛాయలు కూడా కనిపించినట్లు తెలిపారు. కానీ చాలా వరకు చంద్రుడి ఉపరితలం మొత్తం బ్రౌన్ రంగులోనే ఉన్నట్లు పేర్కొన్నారు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గ్రీన్ వర్ణంలో వెన్నెలరాజు దర్శనమిచ్చినట్లు వెల్లడించారు. చంద్రుడిని ఎంత తీక్షణంగా చూస్తే, ఆ ఉపరితలం అంత బ్రౌన్ రంగులో మెరిసినట్లుగా ఉందని మిషన్ స్పెషలిస్టు క్రిస్టినా కొచ్ తెలిపారు. నాసా ట్రాన్స్‌మిషన్‌తో మాట్లాడుతూ.. ఇది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని ఆమె అన్నారు. ఇక కెనడా ఆస్ట్రోనాట్ జెర్మీ హాన్సెన్ మరో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆరిస్టార్చస్ పీఠభూమి వద్ద చంద్రుడి వర్ణం గ్రీన్‌గా ఉందని అన్నారు. చంద్రుడిలోని ఆ చీలక చాలా కొత్తదని, ఇక్కడ ఉన్న కలరేషన్ చాలా విశిష్టంగా ఉన్నట్లు ఆ ఆస్ట్రోనాట్ పేర్కొన్నారు. మూన్‌పై మరోచోట ఇలాంటి రంగు కనిపించలేదన్నారు. చంద్రుడిని చుట్టి వచ్చే క్రమంలో.. భూమి నుంచి దూరంగా ఆర్టెమిస్–2 వ్యోమనౌక వెళ్లినట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జేర్డ్ ఐజాక్‌మాన్ పేర్కొన్నారు. భూమి నుంచి సుమారు 2 లక్షల 50 వేల మైళ్ల దూరం ఆర్టెమిస్ ప్రయాణించినట్లు ఆయన వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి ఏడు గంటలకు ఆర్టెమిస్‌లో ఉన్న నలుగురు ఆస్ట్రోనాట్లు రీడ్ వైజ్‌మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెర్మీ హాన్సెన్ భూమికి సుమారు 2,52,756 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు తెలిపారు. చరిత్రలో గతంలో ఎప్పుడూ కూడా మనుషులు ఇంత దూరం ప్రయాణించలేదన్నారు. ఆర్టెమిస్–2లో పాల్గొన్న సిబ్బందికి ఆయన కంగ్రాట్స్ తెలిపారు. ఆర్టెమిన్‌లో ప్రయాణించిన వ్యోమగాములను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. వారితో ఆయన మాట్లాడారు. మీరు చరిత్ర సృష్టించినట్లు చెప్పారు. అమెరికన్లు అందరూ గర్వపడేలా చేశారన్నారు. ఎంతో గర్వంగా ఉందని కూడా ట్రంప్ ఆ టీమ్‌తో పేర్కొన్నారు. నలుగురు ఆస్ట్రోనాట్లు చాలా ధైర్యవంతులు అని ప్రశంసించారు. ఆధునిక కాలానికి చెందిన మార్గదర్శకులని అన్నారు. అంతరిక్ష రంగంలో అమెరికా అద్భుతాలు సాధించిందని, ఇక నక్షత్రాలనే లక్ష్యంగా ముందుకు వెళ్లనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు



జూలూరుపాడు, : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని వైద్య సిబ్బందిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు గంట పాటు ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి, లోపాలను ఎత్తిచూపారు. తనిఖీలో భాగంగా ఔట్ పేషెంట్ విభాగానికి వచ్చిన కలెక్టర్‌కు ప్రమాదంలో కాలు కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధుడు తన గోడు వెళ్లబోసుకున్నాడు. తనకు ఎవరూ లేరని, వైద్యం చేయించుకునే స్తోమత లేదని కన్నీరు మున్నీరవడంతో కలెక్టర్ చలించిపోయారు. తక్షణమే స్పందించి ఆ వృద్ధుడికి సంబంధించిన పూర్తి డేటాను సేకరించి మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించాలని ఆదేశించారు. నిరుపేదలకు అండగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఇన్ పేషెంట్ వార్డులో వడదెబ్బ కేసులు పెరుగుతుండడంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి తీవ్రత దృష్ట్యా మండలంలో చలివేంద్రాల ఏర్పాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై ఎంపీడీఓ తాళ్లూరి రవి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ వెంటనే చేపట్టాలన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు.. యుద్ధ ప్రాతిపదికన చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆస్పత్రిలోని ఔషధ నిల్వ గదిని తనిఖీ చేసిన కలెక్టర్, స్టాక్ రిజిస్టర్‌ను వాస్తవ నిల్వలతో సరిపోల్చారు. ప్రభుత్వ మందులు బహిరంగ మార్కెట్‌లోకి తరలిపోతున్నాయనే ఆరోపణలు రాకూడదని, నిల్వల్లో తేడాలు వస్తే సంబంధిత అధికారులనే బాధ్యులను చేస్తామని స్పష్టం చేశారు. ఔషధాల పంపిణీలో పారదర్శకత ఉండాలని, రోగులకు బయట మందులు రాయకూడదన్నారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించిన ఆయన, విధులకు గైర్హాజరైన వారి వివరాలను ఆరా తీశారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అత్యవసర సమయాల్లో వైద్యులు, నర్సులు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. కలెక్టర్ వెంట తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

## భక్తులకు ఇబ్బందులు కలగనీయొద్దు



మహబూబాబాద్, : సరస్వతి అంత్యపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్ అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరిలతో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ సరస్వతి ఘాట్, మ్యూజియాన్ని పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో దేవాదాయ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్, విద్యుత్తు, మిషన్ భగీరథ, వైద్య, ఆర్టీసీ అధికారులతో శాశ్వత, తాత్కాలిక పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా చేపట్టిన శాశ్వత, తాత్కాలిక పనులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాల్లో వచ్చిన సమస్యలు పునరావృతం కాకుండా సమగ్రమైన ప్రణాళికలు తయారు చేయాలన్నారు. పారిశుద్ధ్యం పకడ్బందీగా ఉండాలని ఎలాంటి సమస్య రాకుండా ఏర్పాట్లు చేయాలని, 540 మరుగు దొడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మే మొదటివారంలో పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కాళేశ్వర మహత్యంపై తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో పుస్తకాలు ప్రచురణ చేయాలన్నారు. పీఠాధిపతులచే యాగం కార్యక్రమాలు నిర్వహించాలని షెడ్యూల్ తయారు చేయాలని, ఆహ్వాన పత్రికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TElTEL 2010/34557, Cell: 9849758280